# నమస్తే తెలంగాణ
# యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, బుధవారం 15 మే 2024 | YADADRI BHUVANAGIRI



నల్లగొండలో కురుస్తున్న వర్షం

## చిరు జల్లులు

మండు వేసవిలో కురుస్తున్న వర్షాలు జనానికి ఊరట కలిగిస్తున్నాయి. రెండు, మూడు రోజులుగా జిల్లాలో పలుచోట్ల చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం పడుతున్నది. మంగళవారం కురిసిన వర్షంతో ఉక్కపోత నుంచి కొంత ఉపశమనం లభించింది.

# పోలైన ఓట్లు 13,88,680

## భువనగిరి పార్లమెంట్ పరిధిలో 76.78 శాతం పోలింగ్


ఆత్మకూరు(ఎం) పోలింగ్ కేంద్రం వద్ద బారులు దీరిన ఓటర్లు (ఫైల్)

యాదాద్రి భువనగిరి, మే 14 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తుది జాబితా విడుదలైంది. పోలైన ఓటర్ల వివరాలను మంగళవారం అధికారులు విడుదల చేశారు. భువనగిరి లోక్‌సభ పరిధిలో మొత్తం 76.78శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధిక పోలింగ్ శాతం మన దగ్గరే రికార్డయ్యింది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ పరిశీలిస్తే.. మునుగోడులో అత్యధికంగా, ఇబ్రహీంపట్నంలో అత్యల్పంగా ఓట్లు పోలయ్యాయి. ఇక సోమవారం సాయంత్రం తర్వాత పోలింగ్ పూర్తయ్యాక పోలీస్ బందోబస్తు నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. అక్కడ మూడెంచల భద్రతను ఏర్పాటు చేశారు.

### అతి తక్కువగా ఇబ్రహీంపట్నంలో..

ఎండల ప్రభావం ఉన్నప్పటికీ ఎన్నికల్లో మంచి పోలింగ్ శాతం నమోదైందని చెప్పవచ్చు. ఏడు నియోజకవర్గాల్లో ఇబ్రహీంపట్నం మినహా అన్ని చోట్లా 70శాతానికి పైగా ఓట్లు పోలయ్యాయి. 83.71శాతం ఓట్లతో మునుగోడు నియోజకవర్గం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఆలేరులో 82.81శాతం, భువనగిరిలో 82.71, నకిరేకల్‌లో 77.11, జనగాంలో 74.68, తుంగతుర్తిలో 74.06 శాతం పోలింగ్ నమోదైంది. ఇక అర్బన్ ప్రాంతమైన ఇబ్రహీంపట్నంలో 66.83శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ లెక్కన పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా పోలింగ్ నమోదైనట్లు తెలుస్తున్నది.

### 76.78 శాతం పోలింగ్..

భువనగిరి లోక్‌సభ పరిధిలో ఆలేరు, జనగాం, తుంగతుర్తి, భువనగిరి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలు ఉన్నాయి. పార్లమెంట్ పరిధిలో మొత్తం 18,08,585 ఓటర్లు ఉండగా, 13,88,680 మంది ఓటేశారు. అంటే 76.78శాతం ఓట్లు పోలయ్యాయి. 8,98,416 మంది పురుష ఓటర్లకుగాను 7,02,636 మంది.. 9,10,090 మహిళా ఓటర్లకుగాను 6,86,003 మంది ఓటు వేశారు. 79 ఇతరులు ఉండగా 41 మంది ఓటేశారు.

### గతం కంటే 2.36 శాతం పెరిగిన ఓట్లు

భువనగిరిలో 2019 పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే స్వల్పంగా పోలింగ్ శాతం పెరిగింది. అప్పుడు 74.42శాతంతో 12,11,256 ఓట్లు పోలయ్యాయి. అంటే 2019 కంటే ఈ సారి 2.36శాతం ఓట్లు అధికంగా నమోదయ్యాయి. నాడు 81.82శాతంతో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం టాప్ ప్లేస్‌లో ఉండగా, 66.98 శాతంతో ఇబ్రహీంపట్నం చివరి స్థానంలో నిలిచింది. ఇతరుల ఓట్లు 30 ఉండగా, రెండు మాత్రమే పోలయ్యాయి.

### స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిన ఈవీఎంలు

పోలింగ్ ముగియడంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఏడు నియోజకవర్గాల ఈవీఎంలను భువనగిరి పట్టణంలోని అరోరా ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడెంచల భద్రతను ఏర్పాటు చేశారు. జూన్ 4వరకు ఈవీఎంలు అక్కడ ఉంచనున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి మంగళవారం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు.

### టాప్, లీస్ట్ పోలింగ్ కేంద్రాలు ఇవే..

భువనగిరి నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాల్లో భారీ స్థాయిలో ఓట్లు పోలయ్యాయి. మహదేవ్‌పూర్ (పోలింగ్ కేంద్రం 109)లో 94.85శాతం, పచ్చర్లబోడుతండా (24) 94.57, నెమరగొమ్ముల (113) 94.51, తిమ్మాపురం (93.65) శాతం పోలింగ్ నమోదైంది. ఇక అతి తక్కువ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తే.. బొల్లెపల్లి(20)లో 58.38శాతం, భువనగిరి టౌన్ కరెంట్ ఆఫీస్ (74)లో 58.48, సెయింట్ ఎలిజబెత్ హైస్కూల్(99)లో 60.11శాతం ఓట్లు పోలయ్యాయి.

### పోలైన ఓట్లు ఇలా..

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | ఇతరులు | మొత్తం | శాతం |
|---|---|---|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 1,15,723 | 1,11,060 | 7 | 2,26,790 | 66.83 |
| మునుగోడు | 10,8,693 | 1,06,917 | 1 | 2,156,11 | 83.71 |
| భువనగిరి | 9,2,017 | 90,445 | 0 | 1,82,462 | 82.71 |
| నకిరేకల్ | 98,848 | 96,843 | 2 | 1,95,693 | 77.11 |
| తుంగతుర్తి | 97,288 | 97,713 | 4 | 1,92,005 | 74.06 |
| ఆలేరు | 99,073 | 95,726 | 18 | 1,94,817 | 82.81 |
| జనగాం | 90,994 | 90,299 | 9 | 1,81,302 | 74.68 |
| మొత్తం | 7,02,636 | 6,86,003 | 41 | 13,88,680 | 76.78 |



భువనగిరిలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న కేంద్ర ఎన్నికల కమిషన్ జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్ క్షేత్రమయుమ్, జిల్లా ఎన్నిక అధికారి, కలెక్టర్ హనుమంతు జెండగే, రాజకీయ పార్టీల ప్రతినిధులు

# స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

భువనగిరి కలెక్టరేట్, మే 14 : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భువనగిరి పట్టణంలోని అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి, నకిరేకల్, ఇబ్రహింపట్నం, జనగాం, మునుగోడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎంలు సోమవారం రాత్రి అక్కడికి చేరాయి. కేంద్ర ఎన్నికల కమిషన్ జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్ క్షేత్రమయుమ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమక్షంలో మంగళవారం వాటిని భద్రపరిచారు.

వారి వెంట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.


భూదాన్ పోచంపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

# ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

- మండల పరిషత్ కార్యాలయం వద్ద రైతులు, లారీ డ్రైవర్ల నిరసన

భూదాన్ పోచంపల్లి, మే 14 : ధాన్యాన్ని ఏ గ్రేడ్‌గా పరిగణించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే పలు కారణాలు చెబుతూ కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చినా నిర్వాహకులు తేమ, తాలు పేరుతో కొర్రీలు పెడుతున్నారని తెలిపారు. మొత్తం ధాన్యాన్ని ఏ గ్రేడ్‌గా పరిగణించి కొనాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ధాన్యం బస్తాలు దిగుమతి చేసుకోవాలని అడిగిన లారీ డ్రైవర్ రాజుపై సాయి బాలాజీ రైస్ మిల్లు యజమాని దూషించి కొట్టారని లారీ డ్రైవర్లు సమ్మె చేశారు. ఈ క్రమంలో రైస్ మిల్లు యజమానులు కూడా సమ్మెకు దిగారు. దాంతో కొనుగోలు కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యం బస్తాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, అఖిలపక్ష నాయకులు రైస్ మిల్లు యజమానులతో మాట్లాడి సాయిబాలాజీ మిల్లు యజమాని యాదిరెడ్డితో లారీ డ్రైవర్‌కు క్షమాపణ చెప్పించారు. దాంతో లారీ డ్రైవర్లు సమ్మె విరమించారు. రేపటి నుంచి ధాన్యం కొనుగోలు చేస్తారని, ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పిస్తామని ఎంపీపీ హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. అనంతరం రైస్‌మిల్లు యజమానులతో ఎంపీపీ, అఖిలపక్ష నాయకులు సమావేశమయ్యారు. ధాన్యాన్ని ఏ గ్రేడ్‌గా కొనుగోలు చేయాలని ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలో 15 రోజుల్లో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రం వద్ద మండల వ్యవసాయ అధికారి, ఏఈఓలు ధాన్యాన్ని పరీక్షించి సర్టిఫై చేస్తారని, మిల్లు యజమానులు వెంటవెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, పీఏసీఎస్ చైర్మన్లు కందాడి భూపాల్‌రెడ్డి, అందెల లింగంయాదవ్, కోట మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, నాయకులు కళ్లెం రాఘవరెడ్డి, సామ మధుసూదన్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, సామ మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి, అంజయ్య, పద్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రైతులు, రైస్ మిల్లు యజమానులు, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఏ నోట విన్నా గెలుపోటముల చర్చే!



- ఎన్నికల ఫలితాలపైనే సర్వత్రా విశ్లేషణ
- కూడికలు, తీసివేతలతో అభ్యర్థుల మల్లగుల్లాలు
- ఎక్కడ అనుకూలం.. ఎక్కడ ప్రతికూలమో చర్చోపచర్చలు
- ఎవరికీ వారే గెలుపు ధీమాలో ప్రధాన పార్టీలు
- మరోవైపు పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికలపైనా దృష్టి

నల్లగొండ ప్రతినిధి, మే 14 (నమస్తే తెలంగాణ) : గెలిచేదెవరు? ఓడేదెవరు? పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఇప్పుడు ఫలితాల పైనే సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ స్థానాల్లో ఎంపీలుగా ఎవరు గెలుస్తారనే అంశంపైనే జిల్లావాసులు ప్రధానంగా చర్చించుకుంటున్నారు. రాజకీయపార్టీల నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యోగులు, ఇతర రాజకీయ ఆసక్తి ఉన్న వారిలో ఏ ఇద్దరు కలిసినా ప్రస్తుతం చర్చంతా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపైనే కనిపిస్తున్నది. ఇక్కడి ఎంపీ ఎన్నికలతోపాటు పక్క రాష్ట్రంలో గెలిచేదెవరు? అన్న ప్రశ్నల చుట్టే చర్చలు కొనసాగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు, 2019 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత పోలింగ్‌లో కొంత హెచ్చుతగ్గులు ఉండగా అది ఎవరికి లాభిస్తుంది? ఎవరికి నష్టం చేస్తుందన్నది చర్చనీయాంశమైంది

### ఏ ఇద్దరిని కదిలించినా ఎన్నికల చర్చే..

నల్లగొండ ఎంపీగా ఎవరు గెలుస్తారు? భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి ఏ అభ్యర్థి గెలువబోతున్నారు? ఈ రెండు ప్రశ్నలు మాత్రమే కాదు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని 16 ఎంపీ స్థానాల్లో ఏ పార్టీ ఎన్ని స్థానాలు గెలిచే అవకాశం ఉంది? ఫలానా స్థానంలో ఫలానా అభ్యర్థి గెలిచే అవకాశం ఉందంట కదా? పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి ఎవరు వస్తారు? ఎవరికి స్పష్టమైన మెజారిటీ వచ్చే అవకాశం ఉంటుంది? ఇలా ఉమ్మడి జిల్లా అంతటా ఏ ఇద్దరిని కదిలించినా ఇలాంటి చర్చలే కనిపిస్తున్నాయి. పార్లమెంట్ పోలింగ్ ప్రశాంతంగా ముగిసిన నేపథ్యంలో జిల్లాలో ఎవరు గెలువనున్నారనే అంశంతోపాటు.. పక్క రాష్ట్రం, జాతీయ రాజకీయాల పైనా విస్తృత చర్చ కొనసాగుతున్నది.

### ఇక మండలి ఉప ఎన్నికలపై దృష్టి

లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ప్రధాన పార్టీలన్నీ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఉప ఎన్నికలపై దృష్టి సారించారు. సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అభ్యర్థుల తుది జాబితా వెల్లడైంది. దాంతో అందరూ ప్రచారంపైనే కేంద్రీకరించనున్నారు. బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న), బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ప్రధాన పార్టీల నుంచి అభ్యర్థులుగా బరిలో ఉండగా వీరితోపాటు మరో 49 మంది కూడా పోటీలో ఉన్నారు. ఈ నెల 27న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో 25న సాయంత్రం 4 గంటల వరకే ప్రచారానికి గడువు మిగిలి ఉంది. దాంతో మండలి ఉప ఎన్నికల ప్రచారం ఇక నుంచి హోరెత్తనుంది.

### అంచనాల్లో అభ్యర్థులు..

నల్లగొండ పార్లమెంట్ స్థానంలో మొత్తం 17,25,465 మంది ఓటర్లు ఉండగా.. వారిలో 74.02 శాతం.. భువనగిరి పార్లమెంట్ స్థానం పరిధిలో మొత్తం 18,08,585 మంది ఓటర్లకు 76.78 శాతం ఓట్లు పోలయ్యాయి. ఓట్ల పోలింగ్ ప్రక్రియ ముగియడంతో ఇప్పుడు ఆయా పార్టీల అభ్యర్థులు, ముమ్మర ప్రచారం సాగించిన నేతలు.. గెలిచేదెవరు? అన్న అంశం పై ఆరా తీస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా తమకు అనుకూలంగా పోలైన ఓట్ల అంచనాలు వేస్తున్నారు. ఏయే ప్రాంతాల్లో తమకు అత్యధిక మెజారిటీ దక్కుతుందనే అంశంపై ప్రధాన పార్టీల అభ్యర్థులు, ఎన్నికల్లో కీలకంగా పనిచేసిన బాధ్యులు లెక్కలు వేస్తున్నారు. ఎక్కడెక్కడ ఎక్కువ ఓట్లు వస్తే తమ గెలుపునకు అవకాశం ఉంటుందనే అంచనాల్లో బీఆర్ఎస్‌తోపాటు కాంగ్రెస్, బీజేపీ నేతలు మునిగిపోయారు. ఫోన్‌లలో ఆరా తీస్తూ, కాగితాలపై రాస్తూ ప్రతి ఒక్కరూ ఆయా స్థాయిల్లో ప్రస్తుతం ఈ లెక్కల్లోనే మునిగి తేలుతున్నారు.

### నేడు బీఆర్ఎస్ సన్నాహక మీటింగ్

2007 నుంచి వరుసగా నాలుగుసార్లు జరిగిన గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్సే ఇక్కడ విజయం సాధిస్తూ వచ్చింది. ప్రస్తుత ఉప ఎన్నికల్లో మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలన్న పట్టుదలతో బీఆర్ఎస్ ఉంది. అందుకే బుధవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ప్రచార సరళి తదితర అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశం అనంతరం బీఆర్ఎస్ పూర్తి స్థాయిలో ఉప ఎన్నికల కదనరంగంలోకి దూకనుంది.

# దాడి చేసినా చర్యలు తీసుకోరా?

- బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ దాడిని సహించేది లేదు
- ఫిర్యాదులను పట్టించుకోకపోతే ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, మే 14 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నకిరేకల్‌నియోజకవర్గంలోని ఆయా బూత్‌ల వద్ద బీఆర్ఎస్ నాయకులపై అధికార పార్టీకి చెందిన కొంతమంది దాడులు చేశారని, బాధితులు ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోకపోతే బాధిత బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో నల్లగొండ ఎస్పీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన పోలీసు అధికారులను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికలు జరుగుతున్న తీరును పర్యవేక్షిస్తున్న సమయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు కక్షపూరితంగా దాడులు చేసి గాయపర్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు కావాలని స్థానికంగా ఉన్న అధికార పార్టీ నాయకులు రెచ్చగొట్టి ప్రోత్సహిస్తున్నారన్నారు. బాధితులు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. దాడులకు పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఎస్పీ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, కౌన్సిలర్ పల్లె విజయ్, మాజీ ఎంపీటీసీ రాచకొండ వెంకన్న తదితరులు ఉన్నారు.


నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# హైవేపై వాహనాల రద్దీ


చౌటుప్పల్ పట్టణంలో వాహనాల రద్దీ

చౌటుప్పల్ రూరల్, మే 14 : ఎన్నికల సందర్భంగా ఉమ్మడి నల్లగొండతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంత గ్రామాలకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. దాంతో చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేట్, చౌటుప్పల్ పట్టణంలో జాతీయ రహదారిపై మంగళవారం వాహనాల రద్దీ నెలకొంది. హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలతో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

# భువనగిరి బస్టాండ్‌లో దొంగల హల్‌చల్

- సెల్‌ఫోన్లు, పర్సులు, బైకులు మాయం
- పట్టించుకోని అధికారులు
- సీసీ కెమెరాలు, పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని ప్రయాణికుల డిమాండ్

భువనగిరి అర్బన్, మే 14 : జిల్లా కేంద్రంలోని భువనగిరి బస్టాండ్‌కు నిత్యం సుమారు ముప్పై వేల నుంచి నలభై వేల మంది ప్రయాణికులు వచ్చిపోతుంటారు. అలాంటి బస్‌స్టేషన్లో రోజు రోజుకు దొంగల బెడద పెరిగిపోతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సుల్లో మహిళల రద్దీ ఎక్కువ కావడంతో దొంగలు తమ పనిని సులువుగా చేసుకుంటూ పోతున్నారు. గత మూడు నెలల్లోనే ముప్పైకి పైగా దొంగతనాలు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్తున్న క్రమంలో ప్రయాణికుల పర్సులు, బ్యాగులు, సెల్‌ఫోన్లు అపహరణకు గురవుతున్నా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయకుండానే వెళ్తున్నారు. ప్రధానంగా పోలీస్‌స్టేషన్ బస్టాండ్‌కు దూరంగా ఉండడం, ఫిర్యాదు చేసినా తమ వస్తువు దొరుకుతుందో లేదోనన్న అపనమ్మకం, బస్‌స్టేషన్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ లేకపోవడంతో బాధుతులు ఫిర్యాదు చేసేందుకు వెనుకాడుతున్నారు. బస్టాండ్‌కు అద్దెల రూపంలో ప్రతి నెలా రూ.10 లక్షల ఆదాయం ఉన్నా.. ఆర్టీసీ అధికారులు కనీసం హోం గార్డులను నియమించుకునే స్థితిలో లేరంటే ప్రయాణికులపై వారి నిర్లక్ష్యాన్ని తెలుపుతుంది. బస్టాండ్‌లో కేవలం ఒకే ఒక్క సీసీ కెమెరా ఉండడం, అది కూడా పూర్తి స్థాయిలో పని చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా బస్టాండ్‌లో దొంగతనాలు జరుగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను పెంచడంతోపాటు పోలీస్ అవుట్‌పోస్టును ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


భువనగిరి బస్టాండ్

### ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలి

భువనగిరి బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపరచ్చాలి. బస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలు, పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేసి దొంగల బారి నుంచి ప్రయాణికులను రక్షించాలి. ప్రయాణిల వస్తువులు, తప్పిపోయిన వ్యక్తుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. బస్‌స్టేషన్ చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. ప్రైవేట్ వాహనాలు, ముఖ్యంగా ఆటోలు లోనికి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

*-కొడారి వెంకటేశ్, వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు*

# ఎంజీయూకు కొత్త వీసీ ఎవరో?

- ఈ నెల 21తో ముగియనున్న గోపాల్‌రెడ్డి పదవీ కాలం
- జనవరిలో వీసీల నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసిన సర్కార్
- వీసీ రేసులో 157 మంది సీనియర్ ప్రొఫెసర్లు
- గడువులోపు నియామకానికి ఎన్నికల కోడ్ అడ్డంకి




రామగిరి, మే 14 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీకి కొత్త వైస్ చాన్స్‌లర్ ఎవరనేది సందిగ్ధంలో ఉన్నది. రాష్ట్ర వ్యాప్తంగా 22 మే, 2021న పలు యూనివర్సిటీలకు నూతన వీసీలను అప్పటి సర్కార్ నియమించింది. వారి పదవీకాలం ఈ నెల 21తో ముగియనున్నది. రాష్ట్రంలో ఉన్నత విద్యా నిలయాలైన యూనివర్సిటీలకు సకాలంలో వీసీల నియామకం చేపట్టాలనే ఉద్దేశంతో సర్కార్ ఆదేశాలతో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి–విద్యాశాఖ ఈ సంవత్సరం జనవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. దాంతో ఆశావహులైన సీనియర్ ప్రొఫెసర్లు దరఖాస్తులను సమర్పించారు. ఎంజీయూకు ప్రస్తుత వీసీ చొల్లేటి గోపాల్‌రెడ్డి మే 24, 2021న బాధ్యతలు స్వీకరించారు. గడువు ముగిసేలోగా నూతన వీసీలను నియమించేలా అటు సర్కార్, ఇటు ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండటంతో వీసీల నియమకానికి ఇబ్బందులు లేకుండా అవకాశం కల్పించాలని ఎన్నికల కమిషన్‌కు లేక రాసినట్లు సమాచారం. ఈసీ ఆమోదం తెలిపితే గడువులోపు కొత్త వీసీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

### ముందస్తు ప్రణాళికతో దరఖాస్తులు

వీసీల నియామకానికి జనవరిలో నోటిఫికేషన్ జారీ కాగా ఎంజీయూలో ముందస్తు ప్రణాళికలతో దరఖాస్తులు స్వీకరించారు. సుమారు 157మంది సీనియర్ ప్రొఫెసర్స్ తమ అర్హత పత్రాలతో దరఖాస్తులు చేశారు. దరఖాస్తులను ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో స్క్రూటినీ చేసి సర్కార్‌కు పంపించారు. 70 ఏండ్లు దాటిన వారు కూడా వీసీ పోస్టుకు దరఖాస్తు చేయడంతో 65 ఏండ్ల వరకే కటాఫ్ పెట్టాలనే ఆలోచనలో విద్యాశాఖ ఉన్నట్లు తెలుస్తుంది.

### సెర్చ్ కమిటీ సమావేశాల కోసం ఈసీకి లేఖ

వీసీల నియామకాల్లో అర్హులైన వారితో జాబితా సిద్ధం చేసేందుకు ఒక్కొక్క వర్సిటీకి సెర్చ్ కమిటీలను సర్కార్ నియమించింది. వీటిలో యూజీసీ నామినీతోపాటు వర్సిటీ నామినీ, సర్కార్ నామినీ ఉంటారు. ఈ కమిటీ సమావేశాలు నిర్వహించి నూతన వీసీ ఎంపిక అర్హుల జాబితాను సిద్ధం చేయాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఎలక్షన్ కమిషన్ను నుంచి అనుమతి వస్తే సెర్చ్ కమిటీలు సమావేశాలు నిర్వహించే అవకాశం ఉన్నది.

### ఎంఈడీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

రామగిరి, మే 14 : నల్లగొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ కళాశాలల 2023–24 విద్యా సంవత్సరం మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు సీఈఓ జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఫలితాలను www.mguniversity.ac.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రిన్సిపాళ్లు సమాచారం చేరవేయాలని తెలిపారు.